

మా ఆఫీసులో చాలామంది అమ్మాయిలున్నారు. అయితే అమ్మాయిగా గుర్తించబడింది మాత్రం స్నేహలత. అందులో ఆశ్చర్యంలేదు. తెలుగు చిత్రసీమలో ఎందరో గాయకులున్నారు. ఐతే ఒక్క బాలసుబ్రహ్మణ్యం మాత్రమే గాయకుడిగా గుర్తించబడ్డాడుకదా- అలాగన్నమాట।

స్నేహలత అప్పుడే విరిసిన పువ్వులా ఉంటుంది. ఆ తాజాదనం ఆమెలో కనబడుతుంది ఆ పరిమళం ఆమెనుండి వస్తుంది. ఒక్కసారి ఆమె వంక చూస్తే దృష్టి మరల్చుకొనడం కష్టం. ఆమె మా ఆఫీసులో చేరినాక మిగతా అమ్మాయిల ప్రాముఖ్యత పూర్తిగా నశించిపోయింది.

అంతమాత్రాన చాలామంది స్నేహలతను ప్రేమిస్తున్నారనీ పెళ్ళాడాలని అనుకుంటున్నారనీ అనుకునేందుకులేదు. స్నేహలతకు సంబంధించినంత వరకూ మా ఆఫీసులో ఇద్దరే అమ్మాయిలు.

మా ఆఫీసు చాలా పెద్దది. అందులో ఎన్నో విభాగాలున్నాయి. పర్చేజ్ ఆఫీసర్ మారుతీరావు, అకౌంట్స్ ఆఫీసర్ వామనమూర్తి ఈ ఇద్దరే ప్రస్తుతం మా ఆఫీస్‌లో అబ్బాయిలుగా చెలామణీ అవుతున్నారు.

వాళ్ళిద్దరూ స్నేహలతను ప్రేమిస్తున్నారు. స్నేహలతను వాళ్ళే కాదు, ఇంకా చాలామంది ప్రేమించబోయారు. కానీ స్నేహలత తన్ను ప్రేమించే అవకాశం మాత్రం వాళ్ళిద్దరికే ఇచ్చింది. అసలామెకా రెండు సంబంధాలూ రాగా ఇద్దరిలో ఎవరిని పెళ్ళి

చేసుకోవాలో నిర్ణయించడంకోసమే ఆమె మా ఆఫీసులో రిసెప్షనిస్టుగా చేరిందని కొందరు అంటూంటారు. అందులో నిజమెంతో తెలియదు. కాపీ స్నేహలతకు ఉద్యోగం అవసరం లేదనీ, ఆమె తండ్రికి ఊళ్లో హై లెవెల్లో పలుకుబడి ఉన్నదనీ మా అందరికీ తెలుసు.

స్నేహలతకు వీళ్ళిద్దరిలో ఒకర్ని ఎంచుకొనడం పెద్ద సమస్య ఎందుకయిందో మాలో ఎవరికీ అర్థంగాలేదు. ఎందుకంటే....

అకౌంట్స్ ఆఫీసర్ వామన మూర్తి పేరుకు తగ్గట్లుగాక చాలా పొడుగ్గా ఉంటాడు ఎప్పుడు చూసినా ట్రిమ్‌గా ఉంటాడు ఒక్క మాటలో చెప్పాలంటే స్నేహలత అతడు పక్క పక్కన వుంటే మేడ్ ఫర్ ఈచ్ అదర్ జంటలా ఉంటారు.

వామనమూర్తి బట్టలు ఎప్పుడూ తళతళ మెరుస్తూంటాయి. శరీరం నిగనిగలాడుతూంటుంది. క్రాపు చెదరకుండా వుంటే, మనం అతణ్ణి చూస్తున్నామా అతడి బొమ్మను చూస్తున్నామా అన్న భ్రమ కలుగుతుంది.

పర్చేజ్ ఆఫీసర్ మారుతీరావు ఇందుకు పూర్తిగా విరుద్ధంగా ఉంటాడు. ఆడవాళ్ళను ప్రత్యేకంగా ఆకర్షించే లక్షణాలేమీ లేవు అతడికి. మనిషి ఒడ్డూ పొడుగూ బాగానే ఉంటాడు. కాపీ మట్టిలో మాణిక్యం. ఉతికిన బట్టలే వేసుకున్నా, అవి నలిగి ఉంటాయి. ఒత్తైన జుట్టు ఉన్నప్పటికీ అది చెదిరి ఉంటుంది. పచ్చని ఛాయ అయినప్పటికీ ముఖమెప్పుడూ జిడ్డుగా వుంటుంది. అతడ్ని చూడగానే గంటల తరబడి మండు టెండలో పనిచేసి అప్పుడే ఆదరాబాదరగా దుస్తులు వేసుకున్న కార్మికుడిలా కనిపిస్తాడు. ఒకోసారయితే అప్పుడే రైలు ప్రయాణం చేసివచ్చిన వాడిలా ఉంటాడు.

స్నేహలత మా ఆఫీస్‌లో రిసెప్షనిస్టు అయినప్పటికీ, ఆఫీస్‌లో ఈ ఇద్దరితోనూ తప్ప ఇతరులతో మాట్లాడడానికి ఇష్టపడదు. ముఖం మీద మాత్రం ఎన్నడూ చెరగని చిరునవ్వు ఉంటుంది. ఆ ఇద్దరూ తప్పితే ఆమెతో కాస్త ఎక్కువగా మాట్లాడేది నేను మాత్రమే. ఆమె ఆఫీసులో చేరిన రెండు మాసాలకే మా ఇద్దరిమధ్యా కూడా చనువు పెరిగింది.

స్నేహలత ఒకరోజు మారుతీరావుతోనూ, మరోరోజు వామనమూర్తితోనూ- బీచికో, సినిమాకో

పోతూండేది. మర్నాడా విశేషాలు నాకు చెబుతూండేది. వాళ్ళిద్దరూ కూడా తన్ను ప్రాణానికి ప్రాణంగా ప్రేమిస్తున్నారని మెరిసే కళ్ళతో చెప్పేది.

"ఇద్దరిలో ఎవరిని పెళ్ళి చేసుకుంటావు?" అనడిగేవానో రోజున.

"ఇద్దరిలో ఒకరిని." చిలిపిగా నవ్వింది స్నేహలత.

"నా మాటవిని ఈ ఆట మానేసేయ్. మారుతీరావు సంగతి మరిచిపో. అతణ్ణి చేసుకుంటే మీ జంట బాగుండదు. వామనమూర్తి అయితే మీరిద్దరూ సినిమా జంటలా ఉంటారు" అన్నాను.

"కొంపదీసి నువ్వుగానీ మారుతీరావును ప్రేమిస్తున్నావా?" అని నవ్వింది స్నేహలత.

"వాళ్ళ ప్రేమించడం కోసంకాదు నే నాఫీసులో చేరింది. అవసరం" అన్నాను.

"నేను మాత్రం ప్రేమ కోసమే!" అంది స్నేహలత-"నీతో స్నేహం కూడా అందుకే!"

నా కా విషయం తెలుసు. మా ఆఫీసులో ఇద్దరిద్దరు ఆఫీసర్లకు జంటగా ఓ స్టెనోని ఇచ్చారు. నేను మారుతీరావు, వామనమూర్తులిద్దరికీ స్టెనోని. వారు చెప్పిన డిక్టేషన్ను తీసుకుని ఉత్తరాలు టైపు చేయడమూ, పెర్సనల్ ఫైల్సు జాగ్రత్త చేస్తూండడమూ నా విధి. నానుంచి వాళ్ళిద్దరి ప్రవర్తన గురించీ ఎన్నో వివరాలడిగి తెలుసుకుంటూంటుంది స్నేహలత. వాళ్ళిద్దరూ నా విషయంలో ప్రవరాఖ్యుడిలా ప్రవర్తించడం ఆమెకు మరింత సంతోష కారణం. ఆమె తరచుగా నాతో నా గదికివచ్చి ఇద్దరికి సంబంధించిన పెర్సనల్ ఫైల్సు చూసి వెడుతూండేది.

"అదిసరే! మారుతీరావు నెలా భరించగల్గుతున్నావు? ఏదో విశేషముంది" అన్నాను.

అందరూ ఏమనుకున్నా నాకింకో అనుమానం కూడా ఉంది. స్నేహలత ఈ ఉద్యోగంలో చేరడానికి ప్రేమకాక. ఆమె తండ్రికి సంబంధించిన స్వార్థం మరేదైనా ఉన్నదేమోనని. మా ఆఫీసులో పర్చేజ్, అకౌంట్స్ ఆఫీసర్లు కీలకవ్యక్తులు. వారిద్దరినీ తనచుట్టూ తిప్పుకుంటూ స్నేహలత ఎటువంటి రహస్యాలు సేకరిస్తున్నదో!

నాకీ అనుమానం రావడానికి ఓ కారణం ఉంది. స్నేహలత నా గదికి వచ్చినప్పుడల్లా ఈ రెండు సెక్షన్లకు సంబంధించిన ఫైల్సునూ ప్రత్యేక శ్రద్ధతో గమనించేది. ఆమెకా అవకాశం ఇవ్వడం నా

తప్పు. కేవలం ఫైల్సును చూడ్డానికే నా గదికి వచ్చినట్లు ప్రవర్తించే ఆమెను నేను వారించలేకపోయే దాన్ని కానీ ఏరోజైనా ఈ విషయమై నాకు మాటవస్తుందేమోనన్న భయం నాకున్నది.

"మారుతీరావుతో సంవత్సరం పైగా కలిపి పనిచేశావు. నువ్వతన్ని ఎలా భరించగలిగావు?" అంది స్నేహలత.

"మనిషెలాగుంటే నేం? మారుతీరావు మంచివాడు, మర్యాదస్థుడు. బాస్‌గా నేనతన్ని అభిమానిస్తాను" అన్నాను.

ఆ తర్వాత కొద్ది క్షణాల్లో నాకు వామనమూర్తినుంచి పిలుపు వచ్చింది. ఎన్నడూ లేనిది అతడారోజు నన్ను నానా మాటలు అన్నాడు.

"మన సెక్షన్ పెర్సనల్ ఫైల్సు- కాన్ఫిడెన్షియల్‌గా ఉంచవలసినవి. మీరవి బయటివారికి చూపిస్తున్నారని తెలిసింది. మీరిలాంటి పనులు చేస్తే నేను కటకటాల వెనుక కూర్చోవలసి వస్తుంది!" తీవ్రంగానే అన్నాడు వామనమూర్తి.

"నేనవి బయటి వాళ్ళెవరికీ చూపించలేదు. నా స్నేహితురాలు స్నేహలతకు మాత్రం చూపించాను" అన్నాను.

"మన సెక్షన్‌కు సంబంధించినంతవరకూ ఆమెకూడా బయటి మనిషేకదా!" అన్నాడు వామనమూర్తి.

"కానీ, ఆమె మీకూ స్నేహితురాలు."

"స్నేహాన్నీ, ఆఫీసునూ ముడిపెట్టే చౌకబారుబుద్ధి నాకులేదు. నో మోర్ ఎక్స్‌ప్లనేషన్స్. ప్లీజ్ గెటౌట్" అన్నాడు.

నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వెంటనే అక్కణ్ణించి నా గదికి వెళ్ళాను.

ఫైల్సు నేను చాలాసార్లు చూపించాను స్నేహలతకు. వాటినుంచి స్నేహలత ఏం గ్రహించిందీ అన్నదాని కంటె—ఈ విషయం వామనమూర్తికెలా తెలిసిందీ అన్న విషయం నన్ను బాధించసాగింది.

అప్పుడు నా అనుమానం స్నేహలత మీదకు పోయింది. మాటల సందర్భంలో ఆమె ఈ విషయం చెప్పి ఉండవచ్చు.

నేను చటుక్కున స్నేహలత వద్దకు వెళ్ళి, "నీ మూలంగా నేను వామనమూర్తిచేత నానా మాటలూ పడవలసి వచ్చింది" అంటూ జరిగింది చెప్పాను.

"నువ్వు బాధపడకు. ఈరోజు అతడి మనసు బాగోలేదు" అంది స్నేహలత.

"ఎందుకని?" అన్నాను.

"నేను మారుతీరావును వివాహం చేసుకోదల్చినట్లు ఈ ఉదయమే వాళ్ళింటికి ఫోన్ చేసి చెప్పాను."

ఆశ్చర్యంతో నేను దుఃఖాన్ని కూడా మరిచిపోయాను. "అరే, మరి ఇందాకా ఈ విషయం చెప్ప లేదేం?"

"స్పెషల్‌గా చెబుదామను కున్నాను. అయితే నువ్వు స్పెషల్ గానే తెలుసుకున్నావు" అంది స్నేహలత.

"కానీ ఇది చాలా అన్యాయం. నీమీద కోపంతో నన్ను తిట్టడం."

నేనింకా ఏదో అనబోతూండగా "ఈ విషయంలోనూ అతణ్ణి తప్పు పట్టలేము. నీకు తెలియకుండానే నువ్వు నా నిర్ణయానికి తోడ్పడ్డావు. అదీ అతడి దుగ్ధ!" అన్నది స్నేహలత.

"నేను నీకు తోడ్పడ్డానా?" ఆశ్చర్యంగా అడిగాను

"ఆడదానికి భర్త పువ్వులా వున్నాడా అన్నది ముఖ్యం కాదు. తనను పువ్వులా చూసుకుంటాడా అన్నదే ముఖ్యం. నాక్కూడా మీ అందరికిలాగే మారుతీరావు కంటె వామనమూర్తి నచ్చాడు. కానీ జీవితమంతా నేనెప్పుడున్నట్లు గానే ఉండాలనుంది నాకు. ఆ విషయమై తను ఇంప్రూవ్ కావలసి ఉన్నదని వామనమూర్తితో మొదట్లోనే అన్నాను. కానీ ఇంత వరకూ రవంత కూడా ఇంప్రూవ్ కాలేదతడు."

"ఎలా కనుక్కున్నావ్?"

"అతడి ఫైల్సు చూసి..."

స్నేహలత వివరిస్తోంది.

"మారుతీరావు నలిగిన బట్టలే వేసుకోనవచ్చు. చింపిరిజుట్టుతో ఉండవచ్చు. అదో పెద్ద లోపం కాదు. భార్య ఆ లోపాన్ని సవ రించగలదు. కానీ అతడు తన వస్తువులను ఎంతో శ్రద్ధగా మెయింటైన్ చేస్తాడు. అతడి ఇంట్లో అతడిగది అతడి అభిరుచు లకు ప్రతిబింబంలా ఉంటుంది. వామనమూర్తికి తనపైనే తప్ప తన వస్తువులపైన శ్రద్ధ ఉండదు.

"తన ఫైలు చూసుకున్నట్లే నన్నూ చూసుకోగలడు మారుతీ రావు. నీకైనా ఇదే నా సలహా. ఆఫీసర్ని పెళ్ళాడదల్చుకుంటే — అతడు మెయింటైన్ చేసే ఫైల్సు చూడు ముందర...." అంది స్నేహలత. *